# ఇంకా ఇంతేనా?

-కె. వరలక్ష్మి

**"ఆజ్ వహీ గీతోంకీ రాణీ**
**ఆజ్ వహీ హై జానే గజల్..."**

మధురంగా ఉన్న పంకజ్ ఉధాస్ గజల్ వింటూ తన్మయంగా పరవశిస్తున్న వేళ... ఫోన్ మోగింది – వాల్యూమ్ బాగా తగ్గించి...

"హలో, మంజులా హియర్"

"అత్తగారూ"

"చైతూ! నువ్వేనా, ఏంట్రా మరీ నల్లపూసవైపోయేవ్"

అట్నుంచి వాడలా అరిచినందుకు తిట్టబోయి, ఆనందం పట్టలేక మంజులే మరింత గట్టిగా అరిచింది.

"అబ్బా, అలా అరవకే. ఇక్కడ వైద్యం కోసం క్యూలో నుంచున్న వాళ్లంతా ఏం జరిగిందోనని ఆత్రంగా చూస్తున్నారు, రేప్పొద్దున్నే నేను ఇఎన్‌టి స్పెషలిస్టుని కలవాల్సొచ్చేట్టుంది."

"ఇంక నోర్ముయ్యొచ్చు, నే చెప్పేది విను"

"ఇక్కణ్ణుంచెలాగే నీ నోరు ముయ్యడం?"

"ఒరేయ్, నాకొళ్లు మండిందంటే నీకు బిల్లు పేలిపోయేలా చేసెయ్‌గల్ను జాగర్త"

"హమ్మ తల్లీ, అంత పన్చెయ్యకు, చెప్పు"

"సరిగా విను, నువ్వు రేపు ఉదయానికి ఇక్కడికి వస్తున్నావు"

"ఏంటిది, ఫోన్లో హిప్నాటిజమా? నేను రాను గాక రాను"

"ఒరే బాబ్బాబూ, నాకు తోడెవ్వరూ లేరు, ప్లీజ్ రారా"

"దేనికితోడు?"

"రేపు సాయంకాలం నేను విశాఖ వెళ్లాల్సి ఉందిరా, ప్లీజ్‌రా"

"రాజమండ్రిలో బస్సెక్కి విశాఖపట్నంలో దిగడానికి తోడు కావాలా? ఇదేనా నీ స్త్రీవాద పటిమ? ఫోన్ చేసి పలకరించినందుకు నాకిదో పనిష్మెంటా?"

"నాలుగ్గంటలు పైగా బస్సులో కూచుని బోర్ ప్రయాణం చెయ్యడం నా వల్ల కాదు"

"ఇంతకీ ఏమిటి సంగతి, సడెన్‌గా నువ్వొదిలేసిన యూనివర్సిటీని చూడాలన్పించిందా?"

"అదేం కాదులే, చెప్పుకో చూద్దాం"

"ఈ ఫోన్లో గెస్ చెయ్యడం నా వల్ల కాదులే గాని చెప్పు తల్లీ"

"చెప్తున్నా, ఎల్లుండి విశాఖలో జరగబోయే కవి సమ్మేళనంలో నేనో కవిత చదవబోతున్నాను"

"హయ్యబాబోయ్"

"ఏం రా అలా అరిచేవ్?"

"విశాఖ జనాల్ని ఆ దేవుడే రక్షించుగాక!"

"ఏడిసావులే, రేపొస్తున్నావుగా"

"ఇదేమన్నా నీలాగా ఎప్పుడంటే అప్పుడు ఎగనామం పెట్టేసే బడిపంతులుద్యోగం అనుకున్నావేంటి, హౌస్ సర్జెన్సీలో ఎస్కేపైతే ఇక నా పని అంతే సంగతులు. నేన్రావడం లేదు"

"అది కాదురా, ప్లీజ్"

"నథింగ్ డూయింగ్, అసలింతకీ ఎందుకు ఫోన్ చేసానో మరచే పోయాను. ఛీ, నీ కవిత్వం గోలా నువ్వూను. గుర్తుతెచ్చుకుని మళ్లీ చేస్తాలే. ఫోన్ పెట్టేస్తున్నా."

"అరేయ్ చైతూ.. హలో.. హ.." అట్నుంచి చైతన్య అన్నంత పనీ చేసాడు. ఫోన్ కట్టైంది.

"ఏదో కంపెనీ కోసం గానీ, బోడి, వీడు రాకపోతే నేనెళ్లలేనా! పోన్లే విశాఖ సముద్రాన్ని చూపిద్దాం అనుకున్నాను, వాడికి ప్రాప్తం లేదు. ఫ్చ్..." అనుకుంది మంజుల.

చైతన్య మంజుల పెద్దన్నయ్య కొడుకు, వాడికీ ఆమెకీ పదేళ్ల ఎడం ఉంది. వాడిప్పుడు ఆజానుబాహువులా ఎదిగిపోయి ఆమెకన్నా పెద్దవాడిలా కన్పిస్తున్నాడు. మంజుల మరీ అయిదడుగులే ఉంటుందని 'పొట్టి బుడంకాయ్' అని ఆటపట్టిస్తూంటాడు. మంజుల బాల్యం, చదువు అంతా వాళ్ల పెద్దన్నయ్య ఇంట్లోనే కావడం వలన వాడికి మంజుల దగ్గర బాగా చనువుంది. చిన్నప్పుడంతా 'అక్కా' అని పిలిచేవాడు. పెద్దయ్యాక వాడిష్టం వచ్చినట్టు పిల్చి టీజ్ చేస్తూంటాడు. ప్రస్తుతం కాకినాడ రంగరాయలో హౌస్ సర్జెన్సీ చేస్తున్నాడు.

❍ ❍ ❍

మంజుల కాంప్లెక్స్‌కి వచ్చేసరికి బస్సు కదలడానికి సిద్ధంగా ఉంది. ఒక్క ఉదుటున బస్సులోకొచ్చిపడి టిక్కెట్టు తీసుకుంది. ఎక్కడైనా కూర్చునేందుకు సీటు దొరుకుతుం దేమోనని చూడాల్సిన పనే లేకుండా రాడ్స్ పట్టుకుని నిలబడి ఉన్నారు జనం. లిమిటెడ్ హాల్ట్స్‌లో తప్ప ఆగని డీలక్స్ బస్సులోనే జనాన్ని అలా కుక్కేసిన కండక్టర్ మహాశయుడికి జోహార్లు చెప్పుకొంది మనస్సులో.

బస్సు కదిలింది.

గంట తర్వాత గాని నెక్స్ట్ స్టాప్ రాదు. అక్కడెంత మంది దిగుతారో, అక్కడైనా సీటు దొరుకుతుందో లేదో... వెళ్లాల్సిన దూరాన్ని తల్చుకుని దిగులేసింది. భుజాన ఉన్న బేగ్‌ని రెక్టరు మీద పెడదామని వెనక్కి తిరిగేసరికి త్రీ సీటర్లో కిటికీ పక్క కూర్చున్న అబ్బాయి చిరునవ్వుతో లేచి మంజుల చేతిలోంచి బేగ్ అందుకుని పైన పెట్టాడు. ఆమె ఏదో అనబోయేంతలో– "రండి మేడమ్, ఇలా వచ్చి కూర్చోండి" అన్నాడతను సీట్లోంచి బైటికొస్తూ.

"ఫర్వాలేదు.. ఫర్వాలేదు" అంది మంజుల వెనక్కి తిరుగుతూ.

"నిజానికి మగవాళ్లం మేం దురాక్రమణ చేసాం కాని, ఇది మీ లేడీస్ సీటేలెండి"

ఇవతలున్న ఇద్దరూ కదలకుండా బిగుసుకుని కూర్చున్నారు. వాళ్లని దాటెళ్లి కిటికీ పక్క సీట్లో చతికిలబడింది. సరిగా సర్దుకుని కూర్చునే లోపల పక్కనున్నాయన కాళ్లు విశాలంగా జరుపుకొని హాయిగా వెనక్కి చేరబడ్డాడు. మంజుల అదేం పట్టించుకోకుండా థేంక్స్ చెపుదామని చూస్తే ఆ అబ్బాయి, అటెటో చూసుకుంటున్నాడు.

'ఈ రోజుల్లో ఇంత పరోపకారి పాపన్నలున్నారా' అంటూ మంజుల పరిశీలనగా చూసింది. "పాతికేళ్లలోపే ఉంటాయి" అనుకుంది. స్వగతం లాగ, పక్కనున్న వాళ్లకి వినపడేలా.

బ్లూ జీన్స్‌లో లూజుగా ఉన్న వైట్ షర్టుని ఇన్‌షర్టు చేశాడు. కర్లింగ్ హెయిర్‌ని సమ్మర్ కోసం కాబోలు షార్టుగా కత్తిరింపించుకున్నాడు. జుట్టుకీ కాలర్‌కీ మధ్యలో బలమైన తెల్లని మెడ బృహద్ శంఖంలా.

కంభాల చెర్వు స్టాపులో బస్సాగింది. మరో నలుగు రైదుగురెక్కారు. ఆడవాళ్ల చేతుల్లోని లగేజ్ అందుకుని సర్దిపెడుతున్నాడతను. ఆపుకొన్నా ఆగకుండా మంజుల పెదవుల పైకి నవ్వు కమ్ముకొచ్చింది.

గంట తర్వాత వచ్చిన స్టాప్‌లో మంజుల పక్కన కూర్చున్నతను దిగిపోయాడు. నిల్చున్న వాళ్లలో ఒక వయసు మళ్లినామెను పిల్చి కూర్చోబెట్టాడా కుర్రాడు.

మరో గంటకి అన్నవరంలో బస్సు సగం ఖాళీ అయి పోయింది. మంజుల పక్కన కూర్చున్న వాళ్లిద్దరూ దిగి పోయారు. కండక్టరు కొత్త పేసింజర్సుకి టిక్కెట్లు ఇస్తున్నాడు.

ఆ అబ్బాయి రెండు జతలు పట్టే చిన్నపాటి ఎయిర్ బేగ్ పైనుంచి దించి ఇద్దరికీ మధ్యలో పెట్టి ఆ చివర కూర్చున్నాడు 'విత్ యువర్ కైండ్ పర్మిషన్' అంటూ.

రెండు గంటలకి పైగా నిల్చున్న అతన్ని చూసి జాలేసింది మంజులకి.

సీటు చివరికి ఒదిగి కూర్చోవడం చూసి "సరిగ్గా కూచో, పర్లేదు" అంది. అతనటు తిరిగి చిన్న నవ్వు నవ్వేడు.

"నా పేరు క్రిష్ణ" అన్నాడతను ఆమె అడక్కుండానే.

"ఎ.యు. స్టూడెంటువా?"

అవును కాదు అనకుండా మధ్యస్థంగా తలూపేడు.

"హాస్టల్లోనేనా ఉండేది?"

"అవునండి... మీరు జాబ్ హోల్డర్, అవునా?"

"ఊ..."

"బహుశా లెక్చరర్... లేదా ఎనీ టీచింగ్ ప్రొఫెషన్. యామై కరెక్ట్?"

"ఆహా.." అందామె చిన్నగా నవ్వుతూ.

"విశాఖలోనా?"

"కాదు"

"అయితే రాజమండ్రి"

"కరెక్ట్"–

చిరు చీకట్లు ముసురుకుంటున్న వేళ బస్సు తుని కాంప్లెక్స్‌లోకి ప్రవేశించింది. బస్సులో లైట్లు వెలిగేయి. "మ్చ్... మ్చ్..." ఈ చప్పుడేమిటా అని చూస్తే బస్సులో మగవాళ్లంతా ఉంగరాల్ని, ఆడవాళ్లంతా మంగళ సూత్రాల్ని ముద్దుపెట్టేసుకుంటున్నారు దీపాల్ని చూస్తూ.

"ఇక్కడో అరగంట ఆగుతుంది" అని ఎనౌన్సు చేసేసి కండక్టరు, ఆ వెనక డ్రైవరు బస్సు దిగి వెళ్లిపోయేరు. బస్సులో ఎవ్వరూ కదల్లేదు. అందరి దృష్టీ వీళ్లిద్దరి మీదే.

"ఫ్చ్..." అన్నాడు క్రిష్ణ.

"దేనికి?"

"ఏంటి దేనికి?"

"ఆ సౌండు దేనికి?"

"అదా, ఇది ముద్దు మాత్రం కాదులెండి"

"కొంచెం నా బేగ్ చూస్తూ ఉంటారా?"

"కొంచెం చూస్తే చాలా?" – నవ్వులు.

"నేను కొంచెం కాఫీ పోసుకునొస్తాను, మరి మీరో?"

"నాకేం వద్దు"

"పోనీ కూల్‌డ్రింక్"

"వద్దన్నానా"

"అన్యాయంగా అలా అరవకండి, కూల్‌డ్రింకు వద్దన్లేదు మీరు"

"ప్చ్.."

"ఇదెవరికి?"

మంజుల కోపంగా చూసింది.

"కోప్పడకండి మేడమ్" - బేగ్ మీదుగా ఆమె వైపు ఒరిగి "నా వెనక ఎంతమంది దిగుతారో చూడండి" అన్నాడతను గుసగుసగా.

అతను దిగిన మరునిమిషంలో చాలామంది లేచారు బైటికి వెళ్లడానికి. అందరూ ఆమె వైపు పరిశీలనగా చూడ్డం మొదలుపెట్టేరు. ఆడవాళ్లు కాళ్లు నొప్పెడుతున్నా యనే నెపం మీద లేచి నిలబడి ఆమెని చూడ్డం మొదలు పెట్టేరు. మంజుల ముఖం పక్కకి తిప్పుకొని కిటికీలోంచి బైటికి, జుట్టు విరబోసుకుని నిల్చున్న మామిడిచెట్లని చూడసాగింది.

సన సన్నని కామెంట్స్ చినచిన్నగా ఆమె చెవుల్ని తాకి వెళ్తున్నై.

"మరీ ఒంటరిగా ఫీలయ్యేరా?" రెండు పాప్‌కార్న్ పేకెట్స్ తెచ్చి ఒకటి ఆమెకివ్వబోయాడు క్రిష్ణ.

"నో, థేంక్స్"

"తీసుకోండీ" అతను చొరవగా ఆమె చెయ్యందుకొని పేకెట్ చేతిలో ఉంచాడు.

ఆమె పర్స్‌లోంచి ఒక రూపాయి తీసి అతనికివ్వ బోయింది.

"భలేవారే, నేనేమైనా ఈ పేకెట్స్ అమ్ముతున్నాను కుంటున్నారా? ఉంచండి" తిరిగి బస్సులోకి వస్తున్న వాళ్లం దరి దృష్టీ వాళ్లిద్దరి మీది నుంచీ మరలడంలేదు. అయి దారుగురి కంటే కొత్తవాళ్లు ఎక్కినట్టు లేదు. వెనక సీట్లలో ఉన్నవాళ్లు కూడా వాళ్ల వాళ్ల లగేజీలు తెచ్చుకుని వీళ్ల చుట్టుపక్కల సీట్లలో సెటిలైపోయారు.

మరో పది నిమిషాలకి డ్రైవరు, కండక్టరు చెరో సిగ రెట్టు పొగలూదుతూ బస్సెక్కారు. డ్రైవరు తన సీట్లో కూర్చోకుండా ఇంజను బాక్సు మీద కూర్చుని వీళ్ల వైపు చూస్తూ విలాసంగా పొగలు సృష్టించసాగేడు. కొత్తవాళ్లకి టిక్కెట్స్ ఇస్తున్న కండక్టరు నోట్లో కాలుతున్న సిగరెట్టు పొగనెపంతో ఓ కన్ను మూసి ఉంచి రెండో కంటితో ఆమె వైపు దొంగచూపులు చూడసాగేడు.

క్రిష్ణ మాత్రం ఇదేం పట్టనట్టు తన పేకెట్టు విప్పుకొని పాప్‌కార్న్ కరకరా నములుతున్నాడు. "తినండి మేడమ్, పాప్‌కార్న్ వేడివేడిగా బావుంది" అంటున్నాడు.

డ్రైవరు వాచీ చూసుకుని, బాధగా సిగరెట్టు విసిరేసి తప్పదన్నట్టు తన సీట్లోకెళ్లి కూర్చున్నాడు.

కండక్టరు రైట్ చెప్తుండగా ఒక పెద్దామె రెండు బరువు సంచుల్తో ఆదరా బాదరా బస్సెక్కింది. క్రిష్ణ లేచెళ్లి ఆ సంచులందుకుని బస్సులో పెట్టి, తన బేగ్ తీసి తను మంజుల వైపు జరిగి తన సీటు ఆమెకిచ్చాడు.

బస్సు బయలుదేరింది. బస్సులో లైట్లారిపోయాయి. కండక్టరు తన సీట్లోంచి లేచెళ్లి బేనెట్ మీద కూర్చుని డ్రైవరుతో కబుర్లు మొదలుపెట్టేడు.

పాప్‌కార్న్ పేకెట్లు పూర్తయ్యేసరికి ఎక్కడో బస్సాగి పోయింది. రైలు గేటు వేసుందట. బస్సులో లైట్లు వెలి గాయి మళ్లీ.

బస్సుల, లారీల లైట్ల వెల్తుర్లో ఆడవాళ్లు కొబ్బరి బోండాలు తెచ్చి అమ్ముతున్నారు. స్కిల్‌ఫుల్‌గా వాళ్లు బోండాల్ని చెక్కే విధానం చూపించి క్రిష్ణ "చూసేరా, మీ ఆడవాళ్లు ప్రవేశించి సాధించని రంగం లేదిప్పుడు" అన్నాడు.

మంజుల కోపంగా చూసింది. అతని మొహంలోని హావభావాలు చూసి నవ్వేసింది. రెండు బొండాలు తీసు కుని ఒక బొండాం క్రిష్ణకిచ్చింది. అతను కాదనకుండా తీసుకున్నాడు.

"మాక్కూడా బొండాలిప్పించండి మేడమ్" అన్నాడు కండక్టరు పళ్లన్నీ కన్పించేలా నవ్వుతూ.

క్రిష్ణ ముందు సీటు కింద కాళ్లు రిలాక్సింగ్‌గా చాపు కొని ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వరకూ కబుర్లలో చొప్పించేస్తున్నాడు.

"ఈ సంవత్సరం మిస్సిండియా గురించి మీ అభి ప్రాయం ఏమిటి?"

మంజుల ఏం మాట్లాడకపోవడం చూసి "ఆవిడ బదులు మీరెళ్లుంటే మీరే సెలక్టయ్యేవారు" అన్నాడు.

ఇంతవరకూ మనకెందుకొచ్చిందిలే అనుకున్న వాళ్ల సీట్లోని పెద్దావిడ కూడా ఈసారి కళ్లద్దాలు సవరించుకుని మరీ వాళ్లని పరిశీలించడం మొదలుపెట్టింది.

కిటికీలోంచి దూసుకొస్తున్న చల్లని గాలికి మంజుల తెలీకుండానే నిద్రలోకి జారుకుంది. మధ్య మధ్యలో కాస్త మెలకువొచ్చినప్పుడు ఎక్కడో దూరలోకం నుంచి లాగా ఏవేవో కబుర్లు నవ్వులు ఆమెని తాకుతున్నాయి.

"మేడమ్... మేడమ్"

చటుక్కున మెలకువొచ్చింది. క్రిష్ణ భుజం మీద తల వాల్చి, సగంపైగా అతని మీదికి ఒరిగిపోయి నిద్ర పోయింది మంజుల.

ఒక్క ఉదుటున నిటారుగా కూర్చుంటూ చుట్టూ పరి కించింది.

దిగడానికి ఉద్యుక్తులౌతున్న అందరి కళ్లూ ఆమెపైనే ఉన్నాయి. కొందరైతే వెకిలి నవ్వులు నవ్వుతున్నారు.

"వైజాగ్ వచ్చేసాం దిగండి"

మంజుల సూట్‌కేస్ కోసం వెతుక్కోవడం చూసి "మీరు పదండి, నేను తెస్తాను" అన్నాడు క్రిష్ణ.

బస్సు గుమ్మానికెదురుగా మంజుల ఫ్రెండు భాను నిల్చుని ఉంది. మంజుల దిగగానే ఎదురొచ్చి కావలించు కున్నంత పన్జేసింది.

మంజుల గమనిస్తూనే ఉంది - బస్సు దిగిన మగ వాళ్లలో నలుగురైదుగురు ఏదో పనున్నట్టు అక్కడే ఆగిపోయి జేబుల్లోంచి దువ్వెన్లు తీసుకుని తలలు దువ్వేసుకుం టున్నారు.

ఆడవాళ్లతో కలిసి దిగిన కొందరు ఆటోలవైపు నడు స్తూనే వెనక్కి వెనక్కి తిరిగి చూస్తున్నారు. కండక్టరైతే మొహాన్ని కిటికీకి ఆనించి రెప్పవెయ్యడం మరచిపోయేడు.

"అవునూ, నిన్ను వారం రోజులుండేలా రమ్మన్నాను కదా, సూట్‌కేసేదీ ఏం తేలేదా?"

బొటనవేలుతో వెనక్కి చూపించింది మంజుల.

కృష్ణ ఆమె సూట్‌కేసూ, తన ఎయిర్ బేగూ పుచ్చు కుని దిగుతున్నాడు.

"దీన్లో ఏం పెట్టేవు తల్లీ ఇంత బరువుంది?" అంటు న్నాడు పెద్దగా.

"వీడూ... వీడు పెద్దన్నయ్య కొడుకు కదా!.. చైతన్య... అవునా? ఎంత ఎదిగిపోయాడు! ఏరా డాక్టరూ బావు న్నావా?" భాను గొంతు కంచుగంట.

"కొంచెం కరక్షనుంది.. కృష్ణ చైతన్య. ప్రస్తుతానికి ఈవిడగారి దయవల్ల ఇలా ఉన్నాను. రేపు సభలో ఈవిడ కవిత్వం విన్నాక ఎలా ఉంటానో చెప్పలేను"

"ఓరి వాగుడుకాయా, నీ వాగుడేం తగ్గలేదన్నమాట!"

ఇదంతా వింటున్న కండక్టరు మొదట ఆశ్చర్యపోయి తర్వాత గొప్ప డిసప్పాయింటయ్యాడు. కిటికీలోని తలకా యని తాబేలులాగా లోపలికి లాక్కున్నాడు.

బస్సు కదిలి స్టాప్‌వైపు దూసుకుపోయింది.

"బస్సులో వాళ్లందరికీ ఉచితంగా కొన్ని గంటలపాటు మంచి కాలక్షేపం కలిగించామే అక్కా" అన్నాడు క్రిష్ణ.

జుట్టు దువ్వుకుంటున్న వాళ్లంతా నెమ్మదిగా దువ్వె నలు మడిచేసి జేబుల్లో పెట్టేసుకున్నారు. లగేజీలు తీసు కుని ఆటోస్టాండు వైపూ, రిక్షా స్టాండు వైపూ వెళ్లి పోయారు.

బస్సులో వాళ్ల ప్రవర్తన, కామెంట్స్ గురించి భానుకి చెప్తూ "ఇప్పటికైనా ఒప్పుకుంటారా, ఎన్ని వేధవ్వేషాలేసినా మమ్మల్నెవడూ పట్టించుకోడు. ఎంత అణిగీ మణిగీ ఉన్నా విక్టిమ్స్ మీరే. మీ స్త్రీవాదంతో లోకాన్ని చాలా మార్చే స్తున్నాం అంటున్నారు. ఏదీ? ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉంటేనూ..."

అప్పటికే ఆటో మాట్లాడ్డం పూర్తిచేసిన భాను అరమైలు దూరంలో ఉన్న ఆటోని చూపిస్తూ "విక్టిమ్స్ మేమే కాని, లగేజి మొయ్యాల్సింది మాత్రం నువ్వే. ఈ ఊళ్లో ఆటోవాళ్లు ఇక్కడి పూచికపుల్ల తీసి అక్కడ పెట్టరు. రావే మంజూ" అంది మంజుల చెయ్యి పట్టుకుని లాక్కెళ్తూ.

"అన్ని గంటలు నిలబడి సీటిచ్చేననే కృతజ్ఞతైనా లేదే నీకు, ఈ బరువంతా నా చేత మోయిస్తున్నావు, ఛీ... కృతఘ్నురాలా.." వెనకాల నడుస్తూ సణుగుతున్నాడు క్రిష్ణ.

"అవునూ... ఇదంతా ఎలా జరిగిందే, వీణ్ణి బస్సులో చూడగానే నువ్వు పలకరించెయ్యలేదూ?" అడిగింది భాను.

"లేదులే, పొద్దున్నే తన ప్లానంతా చెప్పాడు. ఆడవాళ్ల పట్ల లోకం చాలా మారిపోయింది అన్నానట నేనెప్పుడో. అది తప్పు సుమా అని ప్రూఫ్ చెయ్యడమట ఇదంతా."

"బస్సులో పరాయి మగాడి పక్కన కూర్చోవడం, వాడితో కాస్త చనువుగా మాట్లాడ్డం విచిత్ర విషయాలే ఇంకా మన జనానికి" అంటున్నాడు క్రిష్ణ.

అప్పటికే ఆటో కుర్రాడు రెండుసార్లు వెనక్కి తిరిగి చూడ్డం గమనించి "బాబూ, కాస్త రోడ్డును చూసి తోలు" అన్నాడు గొంతు పెంచి.

"తుని బస్టాపులో నేను దిగినప్పుడు మన వెనక సీటు వాడు ఏమన్నాడో తెల్సా - 'బలే ఛాన్స్ కొట్టేవ్ బ్రదర్. పిట్ట పిటపిటలాడతా ఉంది, కంగ్రాచ్యులేషన్స్, కేరీ ఆన్' అని, ఛీఛీ.. ఎప్పటికి మారతారో మన జనాలు? ఈ ఊహా శృంగారాన్ని ఎంజాయ్ చెయ్యడం ఎప్పటికి మాను కుంటారో!"

"కూల్ డౌన్ మైడియర్ బోయ్, మగాడివి నీకే అంత ఆవేదన కలుగుతూంటే స్వయంగా ఫేస్ చేస్తున్న ఆడ వాళ్లకెలా ఉంటుందో ఆలోచించు" అంది భాను క్రిష్ణ భుజం మీద చెయ్యివేసి.

■